# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## పింఛన్‌పై మధ్యేమార్గం

**ఉద్యోగులు** వ్యతిరేకిస్తున్న నూతన పింఛన్ పథకం (ఎన్‌పీఎస్) స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పింఛన్ పథకాన్ని (యూపీఎస్) ప్రవేశపెట్టింది. పాతకొత్తల మేలు కలయిక లాంటి ఈ కొత్త పథకంలో ఉద్యోగుల డిమాండ్లు, ద్రవ్య పొదుపు సూత్రాల మధ్య సమతూకం పాటిస్తూ మధ్యేమార్గం అనుసరించిందని చెప్పాలి. పదవీ విరమణకు ముందరి 12 మాసాల వేతన సగటులో 50 శాతం పింఛన్‌కు యూపీఎస్ హామీ ఇస్తున్నది. అదేవిధంగా కనీసం పదేండ్లు పనిచేసిన వారికి రూ.10 వేల కనీస పింఛన్ లభిస్తుంది. ఎన్‌పీఎస్ పథకంలో 14 శాతంగా ఉన్న కేంద్రం వాటా యూపీఎస్‌లో 18.5 శాతానికి పెరుగుతుంది. 2004 జనవరి 1 తర్వాత ఉద్యోగాల్లో చేరినవారికి ప్రభుత్వం ఇదివరకు ఎన్‌పీఎస్ ప్రవేశపెట్టింది. ఉద్యోగులకు సంబంధించినంత వరకు అదొక విభజనరేఖలా తయారైంది. ఆ తేదీకి ముందు చేరినవారికి పూర్తి పింఛన్ వస్తుంది. అంటే, వారి చివరి జీతంలో సగం మొత్తం అన్నమాట. దీన్నే పాత పింఛన్ పథకం (ఓపీఎస్) అని పిలుస్తున్నారు. తర్వాత చేరినవారికి ఎన్‌పీఎస్ కింద వారి నెలజీతం నుంచి మినహాయించుకున్న మొత్తం మేరకే పింఛన్ వస్తుంది. అది ఓపీఎస్ కన్నా చాలా తక్కువ మొత్తం అవుతుంది.

సహజంగానే ఉద్యోగుల్లో ఎన్‌పీఎస్ పథకం పట్ల మొదటినుంచీ వ్యతిరేకత మొదలైంది. పాత పింఛన్ పునరుద్ధరించాలనేది వారి ప్రధాన డిమాండ్లలో ఒకటిగా మారింది. తమ వాటా అంటూ ఏమీ లేకుండా పూర్తిగా ప్రభుత్వమే భరోసాగా ఉండే పాత విధానమే తమకు కావాలనేది వారి వైఖరి. 23 లక్షల మంది కేంద్ర ఉద్యోగులకు ఈ పథకం వర్తిస్తుంది. అది కూడా వారు ఎంచుకుంటేనే. ఒకసారి యూపీఎస్‌ను ఎంచుకుంటే ఇక వెనుకకు వెళ్లేందుకు వీలుండదు. రాష్ట్రాలు కూడా తమ ఉద్యోగుల ఎంపిక మేరకు అమలు చేయొచ్చని కేంద్రం అంటున్నది. ఓపీఎస్‌లో చివరి జీతాన్ని బట్టి పింఛన్ నిర్ణయిస్తే యూపీఎస్‌లో చివరి 12 నెలల వేతన సగటును బట్టి నిర్ణయిస్తారనేది గమనించాల్సిన విషయం. 50 శాతం ఉమ్మడి అంశమే అయినప్పటికీ, ఉద్యోగుల 10 శాతం చెల్లింపు కొనసాగుతుంది. అంటే ఓపీఎస్, ఎన్‌పీఎస్‌ల మేళవింపుగా కొత్త యూపీఎస్ ఉంటుంది. తమ వాటా చెల్లింపునే ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్టు ఉందని వారంటున్నారు.

మనదేశంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 2023-24 సంవత్సరంలో చెల్లించిన పింఛన్ రూ.5,22,105 కోట్లు. ఇది ఆయా రాష్ట్రాల ఆదాయంలో 6-21 శాతం మధ్యలో ఉంటుంది. ఇది మోయరాని భారమని కేంద్రం అంటున్నది. కానీ ఉద్యోగులు దీన్ని అంగీకరించడం లేదు. పింఛన్ అనేది తమకు ఆలస్యంగా చెల్లిస్తున్న వేతనమేననేది వారి వాదన. పింఛన్ అనేది ఉద్యోగి హక్కు అని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేయడం ఇక్కడ గుర్తుచేసుకోవాలి. కేంద్రం ప్రతిపాదించిన యూపీఎస్‌ను విపక్షాలు, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తుండటం గమనార్హం. ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు కేంద్రంపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. విస్తృతస్థాయి రాజకీయ ఏకాభిప్రాయంతో, ఉద్యోగుల సానుకూల స్పందనతో మాత్రమే పింఛన్ మార్పులను అమలు చేయగలమని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి.

# కాంగ్రెస్.. ఓపీఎస్ ఎప్పుడు?



రావుల రాజేశం
77801 85674

**'సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, ఓల్డ్ పింఛన్ విధానం (ఓపీఎస్) అమలుచేస్తాం..' కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అభయ హస్తం కింద ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన గ్యారంటీ ఇది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు తొమ్మిది నెలలవుతున్నా ఆ దిశగా అడుగులు ముందుకు పడలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీ తమను మోసం చేసిందన్న భావన ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నది. తాజా గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో 3,69,200 మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వీరిలో 40 శాతం మందికిపైగా ఉద్యోగులు సీపీఎస్ విధానంతో నష్టపోతున్నారు.**




**2004** తర్వాత నియామకమైన వారిని సీపీఎస్ పరిధిలోకి చేర్చారు. వీరంతా సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరుతున్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ఇదే అంశంపై పలుమార్లు ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. 'చేస్తాం.. చూస్తాం' అన్న మాటలే కానీ, ఇంతవరకు సీపీఎస్‌ను రద్దు చేసే ప్రయత్నాలేవీ సాగలేదు. దీంతో ఉద్యోగులు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

సీపీఎస్ అనేది కేవలం ఉద్యోగి చందా ఆధారిత స్కీం. ఈ పథకంలో ఉద్యోగుల మూల వేతనం, డీఏల నుంచి ప్రతి నెలా 10 శాతం చొప్పున కట్ చేస్తారు. ప్రభుత్వం కూడా మరో 10 శాతం చందాను జమచేస్తుంది. ఈ మొత్తాన్ని ఎన్‌పీఎస్-ఎన్‌ఎస్‌డీఎల్‌కు బదిలీ చేస్తారు. అక్కడ ఉద్యోగికి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబర్ (పాన్)లో ఈ మొత్తాన్ని జమ చేస్తున్నారు.

సీపీఎస్ రద్దు కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ఎజెండాగా మారింది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఉత్తర భారతానికో నిబంధన, దక్షిణ భారతదేశానికో నిబంధన అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న హామీతోనే కాంగ్రెస్ రాజస్థాన్‌లో అధికారంలోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఇదే హామీనిచ్చింది. కాంగ్రెస్ మిత్రపక్షమైన జేఎంఎం అధికారంలో ఉన్న జార్ఖండ్‌లోనూ ఓపీఎస్‌ను అమలుచేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఉద్యోగులకు పాత పింఛన్ పేమెంట్ ఆర్డర్లు సైతం ఇచ్చారు. అయితే దక్షిణాదిలోని కర్ణాటకలోనూ సీపీఎస్‌ను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పటివరకూ అది నెరవేర్చలేదు. ఇదే తరహాలో తెలంగాణలో సీపీఎస్ రద్దు నినాదంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ, ఈ రెండు రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దు చేయకపోవడం విడ్డూరం.

కేంద్ర ప్రభుత్వం శనివారం కేబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన భాగస్వామ్య పింఛన్ పథకం స్థానంలో కొత్తగా యూనిఫైడ్ పింఛన్ స్కీమ్ (యూపీఎస్)ను అమలుచేయాలనే నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

> **25 ఏండ్ల సర్వీస్ పూర్తిచేసిన ఉద్యోగులకు 50 శాతం పింఛన్ గ్యారంటీ చేస్తున్నట్టు, సర్వీసులో మరణించిన కుటుంబాలకు 60 శాతం పింఛన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ ఉద్యోగి నెలవారీ వేతనంలో 10 శాతం కోత విధిస్తూ చందాతో కూడిన పింఛన్ పథకాన్ని రద్దుచేసే విషయాన్ని ప్రస్తావించలేదు. దీనిపై ఉద్యోగులు విచారం వ్యక్తం చేస్తున్నారు.**

ఎన్‌పీఎస్-యూపీఎస్ పింఛన్ విధానాన్ని ఎంచుకోవడం ఐచ్ఛికం అని పేర్కొనడంలోనే అసలు మోసం దాగున్నది. 1982 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. పింఛన్ అనేది ఉద్యోగి హక్కు. కాబట్టి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఓపీఎస్ కింద ఉద్యోగి పదవీ విరమణ తర్వాత ప్రతి నెలా సర్వీస్ పింఛన్ అందేది. ఉద్యోగి రిటైరైన చివరి నెలలో ఉన్న వేతనంలో 50 శాతం వేతనాన్ని సర్వీస్ పింఛన్ కింద ప్రభుత్వం చెల్లించేది. ఇప్పుడు 2004 తర్వాత నియామకమైన వారికి సర్వీస్ పింఛన్ అన్నదే లేదు. ఒకవేళ పింఛనర్ చనిపోతే అతని భార్యకు, దివ్యాంగులైన పిల్లలు, పెండ్లి కాని పిల్లలకు సర్వీస్ పింఛన్ అందేది. కానీ, ఇప్పుడు ఆ వెసులుబాటు కూడా లేకుండా పోయింది.

ఒక ఉద్యోగి రిటైర్ అయ్యే నెలలో 50 వేల వేతనం పొందితే, ఆ ఉద్యోగికి పాత పింఛన్ విధానంలో నెలకు రూ.25 వేల వరకు పింఛన్ అందేది. ఇది కుటుంబ పోషణకు, జీవిత చరమాంకంలో బాసటగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ భరోసానే లేకుండా పోయింది. ప్రభుత్వం పలు దఫాలుగా చెల్లించే డీఏ, పీఆర్సీ ఫిట్‌మెంట్లు పింఛనర్లకు సైతం వర్తిస్తాయి. కానీ, సీపీఎస్‌లో ఇవేవీ వర్తించవు. సీపీఎస్‌తో పింఛనర్లకు ప్రభుత్వంతో ఉన్న బంధం పూర్తిగా తెగిపోయింది.

మార్కెట్ హెచ్చుతగ్గులపైనే పింఛనర్లు ఆధారపడాల్సి వస్తుంది. పదవీ విరమణ తర్వాత కమ్యూటేషన్ కింద ఒక ఉద్యోగికి ఓపీఎస్‌లో కొన్నేండ్ల మొత్తం పింఛన్ అడ్వాన్స్‌గా పొందే వీలుంటుంది. ఇంటి నిర్మాణం, పిల్లల చదువులు, పెండ్లిండ్ల కోసం అడ్వాన్స్‌లు తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ వెసులుబాటే లేకుండా పోయింది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరగా స్పందించి సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

> **ఒక ఉద్యోగి రిటైర్ అయ్యే నెలలో 50 వేల వేతనం పొందితే, ఆ ఉద్యోగికి పాత పింఛన్ విధానంలో నెలకు రూ.25 వేల వరకు పింఛన్ అందేది. ఇది కుటుంబ పోషణకు, జీవిత చరమాంకంలో బాసటగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ భరోసానే లేకుండాపోయింది. ప్రభుత్వం పలు దఫాలుగా చెల్లించే డీఏ, పీఆర్సీ ఫిట్‌మెంట్లు పింఛనర్లకు సైతం వర్తిస్తాయి. కానీ, సీపీఎస్‌లో ఇవేవీ వర్తించవు.**



# హైడ్రాజకీయం



తెలంగాణ విజయ్
94919 98702

**తప్పులు చేసి వాటిని కప్పిపుచ్చుకోవటం ఆధునిక కాలంలో ఒక ఫ్యాషనైపోయింది. సహజంగా ఇలాంటి పోకడలను మనం తెరపైనే చూస్తుంటాం. కానీ, దురదృష్టవశాత్తు ఇప్పుడు మన తెలంగాణలో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు, పడుతున్న ఆపసోపాలు అచ్చం అలాగే ఉన్నాయి.**

**రా**ష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టడానికి కాంగ్రెస్ అలవికాని హామీలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆరు గ్యారంటీల పేరిట లెక్కలేనన్ని హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని వంద రోజుల్లోనే అమలుచేస్తామని ప్రజలను మభ్యపెట్టింది. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కింది. అయితే మొదలు 2023, డిసెంబర్ 9న 'రుణమాఫీ' చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయింది. ఆ తర్వాత రుణమాఫీ అమలు తేదీలు మారుస్తూ వచ్చింది. ఆఖరికి మూడు విడుతల్లో రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఏ మాత్రం నెరవేర్చుకోలేకపోయింది. 'రుణమాఫీ' తూతూ మంత్రంగా అమలు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రైతులు ఆగ్రహానికి గురయ్యారు. రోడ్లపై ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తూ, శవయాత్రల రూపేణా ఆందోళనలు చేశారు. వీటన్నింటిని పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం 'హైడ్రా'జకీయానికి తెరలేపింది.

అక్రమ నిర్మాణాల కూల్చివేత ఆహ్వానించదగిన పరిణామం. కానీ, ఇందులోనూ రాజకీయ కోణానికి తెర దీయటమే ఆక్షేపణీయం. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను, నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవటం 'హైడ్రా' వెనుక ఉన్న కుట్ర కోణాన్ని తెలియజేస్తున్నది. కాంగ్రెస్ తమ పార్టీలో చేరాలంటూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి లాంటి నికార్సయిన నాయకులను బెదిరింపులకు గురిచేసింది. లొంగకపోవడంతో ఆస్తుల ధ్వంసంతోనైనా పార్టీలో చేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ హైడ్రామాకు తెరదీసింది. అసలు హైదరాబాద్‌లో చెరువులు మాయమవ్వటానికి కారకులెవరు? ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిందెవరు? సమైక్య రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, టీడీపీలు కాదా? నాడు ఇష్టానుసారం చెరువులపై నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి నేడు నీతులు వల్లిస్తే జనం నమ్ముతారనుకోవటం హాస్యాస్పదం కాదా? కూల్చివేతలను సక్రమంగా అమలుచేస్తే 50 శాతం హైదరాబాద్ కనుమరుగవుతుంది. ఇది సాధ్యమా? ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తేనె తెట్టెను కదుపుతున్నాడనే చెప్పవచ్చు. చెరువుల్లో నిర్మాణాలు చేసినవారు అత్యధిక శాతం కాంగ్రెస్, టీడీపీ నేతలే. వీళ్ల నిర్మాణాలను కూల్చివేసే సాహసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందా? అంటే చేయదనే చెప్పాలి. ఏదో నాలుగు రోజులు హడావుడి చేసి సల్లపడకపోతే అదే సంతోషం. రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రులు, ముఖ్యమంత్రి సోదరుడి ఫామ్‌హౌజ్‌లు సైతం చెరువుల ఆవరణల్లోనే ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేస్తుందా? అలాకాకుండా ప్రత్యర్థులను మాత్రమే టార్గెట్ చేస్తుందా? నిజంగా పారదర్శకంగా చేపడితే మాత్రం తప్పకుండా ప్రజలు స్వాగతిస్తారు, స్వాగతించాలి కూడా. కానీ, కక్ష సాధింపుల కోసమే 'హైడ్రా'ను వాడుకుంటే మాత్రం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

> **రాష్ట్ర ప్రజలు విష జ్వరాలతో అల్లాడుతున్నారు. డెంగ్యూ స్వైర విహారం చేస్తున్నది. చికున్ గున్యా కేసులు రోజురోజుకు అమాంతం పెరుగుతున్నాయి. ప్రభుత్వ దవాఖానల్లో సౌకర్యాలు లేక, మంచాలు దొరకక మనుషులు పిట్టల్లా రాలిపోతున్నారు. రాష్ట్రంలో ఇంత తతంగం జరుగుతున్నా ఏలికలు మాత్రం కనీసం ఒక సమీక్ష జరిపిన పాపాన పోలేదు. ఇక సంక్షేమ గురుకులాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. విద్యార్థులు పాము కాట్లకు గురవుతున్నారు. కలుషిత ఆహారంతో విద్యార్థులు దవాఖానల పాలవుతున్నారు. మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు శాంతిభద్రతల్లో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరూపిస్తున్నాయి.**

ఇలా.. రాష్ట్రంలో సమస్యలు రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు రోడ్డెక్కి నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ ఘటనలు మీడియా కంట పడకుండా 'హైడ్రా' పేరిట కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తున్నది. అందులో భాగంగానే ఈ మళ్లింపు రాజకీయాలు. అయితే, కర్ణాటకలో జరిగిన వాల్మీకి స్కామ్‌లో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల హస్తం ఉన్నదంటూ వార్తలు, ఊహాగానాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ 'హైడ్రా'మాకు ఫుల్‌స్టాప్ పడుతుందనే చర్చ ప్రజల్లో ఇప్పటికే మొదలైంది. ఆ ఇష్యూను డైవర్ట్ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ దిశగా అడుగులు వేస్తారో చూడాల్సి ఉన్నది. ఈ మళ్లింపు రాజకీయాలను ప్రజలు గమనించడం లేదని కాంగ్రెస్ నాయకులు భ్రమ పడుతున్నారు. కానీ, తెలంగాణ ప్రజలు తెలివైనోళ్లు. ఏకంగా కాంగ్రెస్ పార్టీనే డైవర్ట్ చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాల్సింది కాంగ్రెస్ పార్టీయే.

# నాటి నెత్తుటి రోజులు మళ్లా తెస్తరా?



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

**మొన్నటి పొద్దు, ఆగస్టు 22. పాత్రికేయ లోకానికో దుర్దినం. పాలక వికృతిని ఎత్తిచూపిన పాత్రికేయం మీద గుండాలు తెగబడ్డ రోజు. రాజ్య కర్కశం మీద అక్షరాయుధాలు సంధించిన జర్నలిస్టులను పాలకులు పగబట్టిన దినం. తెలంగాణ తొలితరం పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్ చేతులు తెగనరికి, ఆయన్ను హత్య చేసింది ఆగస్టు 22నే. 'ఉనే నహీ లిఖ్నా.. లిఖ్తేసో హాతోన్కో కాడ్దో' అని నిజాం రాజు తాబేదారు ఖాసీం రజ్వీ 1948లో ఆగస్టు 19న హుకుం వేస్తే... ఆగస్టు 22 తెల్లవారుజాము కల్లా షోయబ్ కుడిచేతిని నరికి దారుణంగా హత్య చేశారు.**

**కాం**గ్రెస్ శిబిరం ఎత్తుకున్న ఓ పాట ఎన్నికల్లో జనంలోకి బాగా వెళ్లింది. 'మూడు రంగుల జెండా పట్టి.. సింగమోలే కదిలినాడు' అనే పల్లవితో మొదలై.. 'ఆనాటి రోజులు తెస్తాడు..' అనే చరణంతో సాగుతుంది ఆ పాట. నల్లగొండ గద్దర్ జీవం పోసిన ఆ పాటకు పల్లె ఊగింది. ఆకట్టుకునే జానపద బాణికి జనం పడిపోయారు. అటు రాజకీయ వ్యూహకర్తల పాచిక.. ఇటు పాట కలగలిసి జనం కండ్ల చుట్టూ త్రిశంకు పొరల్లా అల్లుకున్నయి. నిలబడి ఓట్లు గుద్దేశారు. కాంగ్రెస్ పార్టీని అందలమెక్కించారు. ఇక అక్కడి నుంచి కాలచక్రం గిర్రున తిరిగింది. వెలుగు దివ్వెలను తడుముకుంటూ అభివృద్ధి పథంలోకి కాదు, చీకట్లను పులుముకుంటూ తిరోగమనంలోకి జారింది. అటునుంచి అటే తిరిగి ఆనాటి ఆగస్టు 22ను వాపస్ తీసుకొచ్చింది. మళ్లీ అదేరోజున జర్నలిస్టుల మీద దాడికి తెగబడటం కాకతాళీయమే అయినా.. ఏమరుపాటు మాత్రం కాదు. పక్కా పథకం ప్రకారమే జరిగిన దాడి. ప్రభుత్వ పెద్దల ప్రోద్బలంతోనే జరిగిన దాడి. రాజ్యం ప్రేరేపించిన దాడి.

ఒకవైపు పంట రుణాలన్నీ మాఫీ చేశామని సర్కారు ఊదరగొడుతున్నది. మరోవైపు తమ రుణాలు మాఫీ కాలేదని రైతాంగం ఎదలు బాదుకుంటున్నది. వేలమంది రోడ్లమీదికొచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నరు. అది 41 లక్షల మంది అన్నదాతల భవిష్యత్తు సాగు సంకటం. ఈ నేపథ్యంలో మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి ప్రజల్లోకి వెళ్లి పాలనా తీరుకు అద్దం పట్టే ప్రయత్నం చేసిండ్రు. వాస్తవ పరిస్థితి అంచనా కోసం ముఖ్యమంత్రి సొంతూరు కొండారెడ్డిపల్లి వెళ్లిండ్రు. అది జర్నలిస్టులుగా వారి కర్తవ్యం. దీనికే పాలకుల కడుపు మండింది. దాడికి పూనుకున్నారు. ఆ ఊరిలో నిజంగా సంపూర్ణ రుణమాఫీ అయినట్టయితే.. జర్నలిస్టులను సాదరంగా ఆహ్వానించి, 'ఇదీ మా ఘనత' అని తొడగొట్టి ప్రపంచానికి చాటొచ్చు. 'ఇక రాజకీయాలు వదిలెయ్ కేటీఆర్.. నువ్వు రాజీనామా చెయ్ హరీశ్‌రావు' అని జనం నుంచే డిమాండ్ పెట్టొచ్చు. ఇది చేయకపోగా మహిళలనే సోయి లేకుండా మూకదాడికి తెగబడటం నీతిమాలినతనం.

ఇదే రోజున జరిగిన మరో ఘటన.. రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతుల మీద రాళ్ల దాడి. అది తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో జరిగింది. సోషల్ మీడియాలో వైరలైన వీడియోలను చూస్తుంటే.. గతం కండ్లలో మెదిలింది. మా ఊరు కర్విరాల కొత్తగూడెం. తుంగతుర్తి నియోజకవర్గం. ఇక్కడ బతకాలంటే బండయినా కొట్టి పొట్ట పోసుకోవాలే.. లేదంటే రాజకీయ హత్యలు చేసైనా పూట




గడుపుకోవాలె. రాయలసీమ జిల్లాలను మించిన కరువు, రాజకీయ ఫ్యాక్షనిజం తుంగతుర్తి పల్లెల్లో ఉండేది. ఎదిగిన పోరలకు పని దొరక్కపోయేది. గోటికి మీసం అందకముందే అనివార్యంగా చేతికి ఆయుధం అందేది. వేల ఎకరాల భూములున్నయి కానీ, నీళ్లు లేవు. చినుకులు కురిసి సెక్క తడిస్తే.. ఇంత ధాన్యం చేతికి వచ్చినట్టు, లేకుంటే లేదు. పూట గడవటమే గగనం. చదువుకు పొమ్మని ప్రోత్సహించే కుటుంబాలు అతి తక్కువ. ఆకలి ఉండి, అడ్డూ అదుపు లేని పోరలను రెండు ప్రధాన రాజకీయ పార్టీలు టార్గెట్ చేసేవి. ఇంత కూర పెట్టి, పావు సారా పోసి చేరదీసేవి. నాలుగు రోజులు తిరక్కుండానే చేతికి కర్రో, కత్తో ఇచ్చి వేసి రమ్మంటే ఊరు ఊరంతా రణరంగమయ్యేది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాయలసీమలో ఫ్యాక్షన్ హత్యలు ఆగినాయి కానీ.. తుంగతుర్తి పల్లెల్లో మాత్రం రాజకీయ అరాచకాల పరంపర అట్లానే కొనసాగింది. కొత్తగూడెం, గుమ్మడవెల్లి, కుక్కడం, అన్నారం కుంటపల్లి, వెలుగుపల్లి, గోరంట్ల, సంగెం మొదలైన ఏటివతలి గ్రామాల్లో నిత్య హత్యలతో తెల్లారేది. రాజకీయ కార్పణ్యాలతో ఇక్కడి భూమి నెత్తురుతో తడిసి ప్రతీకార విత్తులు మొలిచేవి.

> **కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తుంగతుర్తి బాగుపడ్డది. తన మెదడుకు పదునుపెడితే బీడుకు తడి తాకింది. కాళేశ్వరం కట్ట మీంచి తల్లి గోదారమ్మ వచ్చి నెత్తుటి కాళ్లను కడిగింది. మిషన్ కాకతీయతో ఊరూరా చెరువులు, కుంటలు నిండినయి. ప్రతి మడి తడిసింది. పల్లె పచ్చబడ్డది.. బీడు పండింది. కరువు తీరింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తన, మన అనే భేదం లేకుండా రాజకీయ కక్షలు, కొట్లాటల మీద ఉక్కుపాదం మోపారు.**

సగటు మనిషి బువ్వకు, బతుక్కు భరోసా దొరికింది. మలితరం పిల్లలు బడిబాట, పెద్దలు మడిబాట పట్టిండ్రు. రాజకీయ కార్పణ్యాలు, హత్యలు ఆగిపోయినయి. సుఖశాంతులు వెల్లివిరుస్తున్నయి. మా ప్రాంతంలో ఇది తెలంగాణ వచ్చినప్పటి కంటే గొప్ప విప్లవం. ఇది 1789 ఫ్రెంచ్ విప్లవ భావజాలం కంటే మరింత విస్తృతమైనది. దీన్ని సాధించిన నవతరం విప్లవకారుడు కేసీఆర్.

అటువంటి నియోజకవర్గంలో ఇన్నాళ్ల తర్వాత మళ్లీ రాజకీయ గొడవలు అనగానే గుండె గుభేల్‌మన్నది. ఆనాడు ఇంతే.. ఎక్కడో మండల కేంద్రంలో కొట్లాటలైతే.. అది రాత్రికిరాత్రే పడగ విప్పి పల్లెలకు విస్తరించేది. గృహ దహనాలు, లూటీలు, పంట విధ్వంసాలయ్యేవి. నెత్తుర్లు చిందేవి. ఇప్పుడు దసరా పండుగ, పంచాయతీ ఎన్నికలు కలిసి వస్తున్నయి. పెద్ద పండుగకు యమగండమే పొంచి ఉన్నది. ఆయుధ పూజ అనంతరం తంతు ఏ దారుణానికి దారితీస్తుందో..! దసరా పూజ కాడ వేటపోతును కొట్టి, తుపాకీ పేల్చటం ఆనవాయితీ. ముదిరాజులు వీరకత్తి పట్టి పోతును కొట్టి పూజ ఆరంభిస్తే.. ఊరి పెద్ద తుపాకీ పేల్చి క్రతువు ముగిస్తాడు. గ్రామాల్లో ఇది పెద్దరికపు ఆధిపత్య సింబల్. ఇగో ఈ ఈగో కోసమే ప్రతి ఊరులో రెండు గ్రూపులు మోపైతున్నయి. ఎవరి పంతం వాళ్లదే. ఎవరి ముఠా వాళ్లకే. దీనికి సర్పంచ్ ఎన్నికలు తోడు వచ్చినయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న రాజకీయ కక్షలు మళ్లీ ఆనాటి పరిస్థితులకు దారితీస్తాయేమో అనే భయం నాలాంటి సగటు తుంగతుర్తి వాసిని భయపెడుతున్నది. పోలీసుల అప్రమత్తత, వారి బాధ్యతాయుతమైన విధులే మా ప్రాంతానికి ఇక రక్షక కవచం




## రైతులపై నోరు పారేసుకోవద్దు



**నిరాధారమైన, అవాస్తవాలతో కూడిన రెచ్చగొట్టే ఆరోపణలు చేసిన ఎంపీ కంగనా రనౌత్‌పై బీజేపీ వెంటనే చర్యలు తీసుకోవాలి. రైతుల సమస్యలపై ఆమెకు ప్రాథమిక సమాచారం, అవగాహన లేవు. ఒక ఎంపీగా ఉండి ఓ వృత్తి, వర్గంపై అహంకారపూరిత ఆరోపణలు చేయడం మంచిది కాదు.**

**- కుశ్వంత్ సింగ్, పంజాబ్ మాజీ సమాచార కమిషనర్**